

కథా కౌముది

# ఈజ్ నాట్ ఈక్వల్ టూ

పులగం చిన్నారాయణ



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

ఉదయం...

కిచెన్ కిటికీలోంచి వాళ్ళిద్దరూ క్లియర్‌గా కనిపిస్తున్నారు. ఇద్దరూ గుసగుసలాడుతున్నట్టు మాట్లాడుకుంటున్నా, వాళ్ళ మాటలు సృజనకు చాలా స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"పద వెళ్దాం" అంటున్నాడు చేతన్.

"అదేదో ఏరా పోటర్ బుక్ చూపిస్తానన్నావ్ కదన్నా. అది చూసేసి పోదాం" అని బతిమలాడుతున్నాడు తిరపతి. హ్యారీ పోటర్‌ని వాడు పలికిన తీరు చూసి సృజనకు నవ్వొచ్చింది.

"ఇప్పుడు గ్రౌండ్‌కి వస్తేనే, నీకు హ్యారీ పోటర్ చూపిస్తా. లేకపోతే లేదు" అని దబాయిస్తున్నాడు చేతన్.

"సాయంత్రం మర్చిపోకుండా చూపించాలి" అన్నాడు తిరపతి.

"ఈ డ్రెస్సేంట్రా? మన టీం అంతా నవ్వుతారు. అటూ ఇటూ పరిగెట్టగలవా లేదా? వెళ్ళి లాగూ చొక్కా వేసుకో" ఆర్డరేశాడు చేతన్.

"అమ్మో... అమ్మ కొడుతుంది. చౌరస్తా కెళ్తున్నానని అబద్ధం చెప్పి మరీ వస్తున్నా" అని క్రికెట్ బ్యాట్, బాల్, వికెట్స్ తీసుకుని బయటికి పరిగెత్తాడు తిరపతి. వెనుక కామ్ గా చేతన్ వెళ్ళాడు.

సృజనకు తిరపతిని చూసి నవ్వొచ్చింది.

ఆ పంచె, వంటిమీద సిల్వర్ కలర్.. అచ్చం బాలగాంధీలాగానే ఉన్నాడు. ఆ వేషంలో వాడు క్రికెట్ ఎలా ఆడతాడో కదా అనిపించింది.

సృజన వాళ్ళింటి ఎదురుగా ఖాళీ ప్లేస్‌లో చిన్న పాకలో ఉంటారు తిరపతి వాళ్ళు.

ఆ సైట్ ఓనర్స్ సెక్యూరిటీ కోసమని వాళ్ళని అక్కడ ఉంచారు.

తిరపతి వాళ్ళమ్మ లక్ష్మి చుట్టుపక్కల ఇళ్ళల్లో అంట్లు తోముతుంది. తిరపతి నాన్న గాంధీ వేషం వేసుకుని చౌరస్తాలో విగ్రహంలా పొద్దున్నుంచీ సాయంత్రం దాకా అలా నిలబడే ఉంటాడు. వాళ్ళూ, వీళ్ళూ వేసే డబ్బులన్నీ పోగయ్యాక అటునుంచి అటే వైన్ షాపుకెళ్ళి తాగేసి వస్తాడు. అది ఎవరో వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తే వైరల్ కూడా అయింది. దాంతో వైన్ షాపువాడు ఆ వేషంలో వచ్చి మందు తాగొద్దని హెచ్చరించాడు కూడా.

సాధారణంగా పనిమనుషులు ఆ ఇంటి కబుర్లు ఈ ఇంటిలోనూ, ఈ ఇంటి కబుర్లు వేరే ఇంట్లోనూ చెబుతుంటారు. లక్ష్మి అలాక్కాదు.

సృజనకు లక్ష్మి అంటే అందుకే నచ్చుతుంది. ఒక్కగానొక్కకొడుకు తిరపతి గురించే లక్ష్మి బెంగ. లక్ష్మి మాట్లాడే పదిమాటలూ కొడుకు గురించే ఉంటాయి.

మాడు వాసన వచ్చినట్టనిపించి సృజన ఉలిక్కిపడింది. కర్రీ మొత్తం నల్లగా మాడిపోయింది. గబగబా స్టౌ కట్టేసింది.

"ఏంటీ వాసన?" అంటూ కిచెన్‌లోకి వచ్చాడు హనుమ. ఆరోజు ఆదివారం కావడంతో చాలా లేట్‌గా నిద్రలేచాడు.

"వంట అనేది ధ్యానం చేసినట్టు చేయాలి తప్ప, అలా పరధ్యానంలో చేయకూడదు బుజ్జీ" అన్నాడు హనుమ.

"మహానుభావా మొదలుపెట్టారా?" అంది సృజన నవ్వుతూ.

"నీకు నేనేం చెప్పినా క్లాసులు పీకుతున్నట్టే ఉంటుంది" హనుమ మాటల్లో కొంచెం కోపం ధ్వనించింది.

"అవును... నిజాన్ని చాలా క్లాస్‌గా చెప్పారు" అంది సృజన, హనుమ ముక్కుపట్టుకుని లాగుతూ.

హనుమ విదిలించుకున్నాడు.

సృజన మనసు చివుక్కుమంది. కానీ అలవాటైపోయింది. కాదు పెళ్ళయిన దగ్గర్నుంచీ అలవాటు చేసుకుంటోంది.

"సరే.... కాఫీ పెట్టి తగలడు.. వీడేడి?"

సృజన గతుక్కుమంది. ఏదో టాపిక్ డైవర్ట్ చేయాలని చూడబోయింది.

హనుమ మొహంలో కోపం స్పష్టంగా తెలుస్తోంది.

"మళ్ళీ గ్రౌండ్‌కి పోయాడా?"

"ఏమో... నాకేం తెలుసు" అంది చిన్నగా సృజన.

స్టవ్ మీద పాలు మరగడం మొదలయ్యాయి.

"వాడు నీ కొడుకు కదా. ప్రతిదానికీ అడ్డం పడుతుంటావ్ కదా. మా క్యాషియర్ కొడుకు స్కూల్ ఫస్ట్. చివరకు మా అటెండర్ కూతురికి కూడా ఎప్పుడూ ఫస్ట్ ర్యాంకే వస్తుందట. మేనేజర్ కొడుకైన వీడు మాత్రం ఎప్పుడూ సెకండ్‌లోనే ఉంటాడు. నీ కొడుకు వల్ల నా పరువుపోయేటట్టు ఉంది."

సృజన ఈ మాటలు వింటూనే కాఫీ కలిపి హనుమకి ఇచ్చింది.

"ఏం దిమ్మచెక్కలా మాట్లాడవ్. ఎప్పుడూ గ్రౌండ్ పట్టుకు తిరుగుతాడు. ఆ పనికిమాలినోడితో తిరగొద్దని ఎన్నిసార్లు చెప్పాలి. ప్రతిదానికీ నీ సపోర్టు. రేపు నీ కొడుకు కూడా చదువు సరిగ్గా లేక అలా రోడ్లమీద గాంధీ వేషం వేసుకుని ముష్టెత్తుకోవాల్సిందే."

సృజన ఇక తట్టుకోలేకపోయింది. హాల్లోకి వెళ్ళిపోయి టీవీ ఆన్ చేసింది.

కాఫీ గ్లాస్‌ని సింక్‌లోకి విసిరేసిన సౌండ్ వినిపించింది.

హనుమ బెడ్‌రూములోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. టీవీ ఆన్ చేసిందన్నమాటేగానీ ఆమె చూపులు టీవీ మీద లేవు. మనసు ఎటో పరుగెడుతోంది.

భర్తను కసురుకోవాలన్నంత కోపంగా ఉంది. కానీ ఏం అనలేని పరిస్థితి. తానుకూడా ఎదురు మాట్లాడితే ఇల్లు రణరంగం అవుతుందని తెలుసు. అలాగని హనుమ దుర్మార్గుడేం కాదు. క్రమశిక్షణ, రూల్సు, రెగ్యులేషన్స్ అంటుంటాడు. బ్యాంక్‌లో సిస్టమేటిక్‌గా ఉండాలన్నట్టుగా, ఇంట్లో ఉండాలంటే ఎలా?

చేతన్ అంత బ్రైట్ స్టూడెంట్ కాకపోయినా, గుడ్ స్టూడెంట్. మార్కులు బాగానే వస్తాయికానీ, తన కొలీగ్సు, ఫ్రెండ్స్ పిల్లల మార్కులతో పోల్చి చూస్తుంటాడు హనుమ. అది కరెక్టు కాదంటుంది సృజన.

పక్కనవాళ్ళతో పోల్చుకుని ఎదగకపోతే లైఫే కాదంటాడు హనుమ.

వారానికోసారైనా ఇంట్లో అలాంటి డిస్కషన్ కామన్ అయిపోయింది.

అతను కసురుకోవడం.. ఆమె కామ్ అయిపోవడం.

సృజనకు వాళ్ళన్నయ్య గుర్తుకొచ్చాడు.

వాడు చిన్నప్పట్నుంచీ హాస్టల్‌లోనే పెరిగాడు. నో స్పోర్ట్స్, నో గేమ్స్.. ఓన్లీ బుక్స్ అన్నట్టుగా నాన్న వాణ్ణి తయారు చేశాడు.

అన్నయ్య పెద్ద చదువులు చదివాడు. ఫారిన్‌లో ఉద్యోగం కూడా సంపాదించాడు. వాడు – వాడి ఉద్యోగం తప్ప వేరే లోకం తెలియదు. ఎవ్వరితోనూ రిలేషన్ మెయింటైన్ చేయడు. చివరకు అమ్మానాన్నతోను, తనతోనూ కూడా. అక్కడే ఎవరినో ఫారిన్ అమ్మాయిని పెళ్ళి చేసుకుని సెటిలైపోయాడు. ఆ విషయం అమ్మానాన్నలకి కూడా చెప్పలేదు. సృజన నాన్న ఇప్పటికీ బాధపడుతుంటాడు. వాణ్ణి అనవసరంగా చదువుల జైల్లో బంధించి తప్పు చేశానని.

చేతన్‌ని కూడా అలా చదువుల జైల్లో బంధించాలని లేదు సృజనకి. చదువుకోవాల్సినప్పుడు చదువుకోవాలి. ఆడుకోవాల్సినప్పుడు ఆడుకోవాలి. ఎంజాయ్ చేయాల్సినప్పుడు ఎంజాయ్ చెయ్యాలి.

హనుమతో ఈ విషయం డిస్కస్ చేసినప్పుడల్లా ఒకటే అంటాడు. "మీ ఫ్యామిలీ జీన్స్ వేరు.. నా జీన్స్ వేరు."

సృజన అలా చాలాసేపు ఆలోచనల్లో మునిగిపోయింది.

చేతన్ పరిగెత్తుకుంటూ లోపలకు వచ్చాడు. బ్యాట్, బాల్, వికెట్స్‌ని హాల్లోని సోఫా కిందకు తోసేసి వగురుస్తూ తల్లి పక్కన కూర్చున్నాడు.

"మ్యాచ్ అయిపోయిందా నాన్నా?" అడిగింది సృజన కొడుకుని దగ్గరకు లాక్కుంటూ.

"లేదమ్మా.. మధ్యలో ఆపేసి వచ్చాం" అంటూ ఏదో చెప్పబోయి, బెడ్‌రూం వైపు చూశాడు భయంగా.

"ఏం ఫర్లేదు" అన్నట్టుగా కళ్ళెగరేసింది సృజన.

"గ్రౌండ్‌కి లక్ష్మి ఆంటీ వచ్చింది. తిరపతిని కొట్టుకుంటూ తీసికెళ్ళిపోయింది. వాడు రానని గ్రౌండ్ అంతా పరిగెత్తాడు. అయినా వదిలిపెట్టలేదు. పాపం కదమ్మా. తిరపతిని స్కూలుకీ వెళ్ళనివ్వరు.. ఆటలూ ఆడుకోనివ్వరు" అన్నాడు చేతన్.

సృజన ఏదో చెప్పబోయింది. ఈలోగా బెడ్‌రూములో చప్పుడు వినిపించి, చేతన్ కంగారుగా తన గదిలోకి పరిగెత్తి బుక్ తీసుకుని చదువుతున్నట్టుగా నటించసాగాడు.

మధ్యాహ్నం..

ఆరోజు లక్ష్మి లేట్‌గా వచ్చింది. ఎప్పుడూ నవ్వుతూ కనిపించే లక్ష్మి ఆ రోజు ముభావంగా ఉంది. మొహం వాడిపోయి ఉంది. చాలా నీరసంగా కనబడుతోంది.

"లక్ష్మీ వంట్లో బాగోలేదా?" అడిగింది సృజన.

"ఏంటోనమ్మా.. మనసు గుబులుగా ఉంది" అంది సింక్‌లో అంట్లు తోమడం మొదలుపెడుతూ.

"ఏమైంది లక్ష్మీ?"

"ఏం లేదమ్మా ఏవో కష్టాలు" అంటూ చెప్పడానికి ఇబ్బంది పడింది.

"ఏంటి తిరపతిని గ్రౌండ్‌లో కొట్టావంట?" అడిగింది సృజన.

తిరపతి ప్రస్తావన రాగానే లక్ష్మి ఒక్కసారిగా బేలగా మారిపోయింది. ఆమె కళ్ళనుంచి నీళ్ళు జలజలా రాలిపోయాయి.

"ఊర్కో లక్ష్మి... ఏమైంది?" అంతకుమించి ఎలా ఊరడించాలో సృజనకు అర్థంకాలేదు.

"నా పెనిమిటికి వారం నుంచి పేనం బాగోలేదమ్మా. వేషం కూడా వేసుకోవడంలేదు. కానీ రాత్రిళ్ళు మందు తాగేసి వస్తున్నాడు. రోజూ డబ్బు.. డబ్బులూ అని నాతో గొడవపెట్టుకుంటున్నాడు. నేను మాత్రం ఎన్నని తేగలనమ్మా. అందుకే తిరపతిగాడ్ని రెండురోజులనుంచి గాంధీ వేషం వేసి ఆ చౌరస్తా దగ్గరకు పంపిస్తున్నా. నా పెనిమిటికన్నా ఆడికే డబ్బులెక్కువొస్తున్నాయి. ఈరోజు ఆదివారం కదా. క్రికెట్ ఆడుకోవాలి. నేను వెళ్ళనన్నాడు. నేను బతిమాలి ఒళ్ళంతా రంగుపూసి, పంచెకట్టి పంపించాను. నా కన్నుగప్పి ఆ వేషంతోనే గ్రౌండ్‌కెళ్ళి క్రికెట్ ఆడుతున్నాడమ్మా. నాకు పిచ్చకోపం వచ్చేసింది. రంగంతా వెలిసిపోయింది. మళ్ళీ వేయాలంటే బోలెడంత ఖర్చు. ఆ కోపంతో కొట్టిపారేశానమ్మా. పిచ్చి సన్నాసి... తినడానికి కూడా పట్టుకెళ్ళకుండా ఏడ్చుకుంటూ వెళ్ళిపోయాడు" పాపం, లక్ష్మి కళ్ళల్లోంచి మళ్ళీ కన్నీళ్ళు తన్నుకొచ్చాయి.

సృజన మనసు కూడా బరువెక్కిపోయింది. తన కొడుకు ఈడే వాడిది కూడా. వీడేమో చదువుకుంటుంటే, వాడేమో అడుక్కోవాల్సి వస్తోంది. "మనుషులందర్నీ ఈక్వల్‌గా ఎందుకు ఉంచడో.. ఏంటో దేవుడి మాయ" అనుకుంది.

"ఈ వయసులో పిల్లలకి ఆడుకోవాలనే ఉంటుంది లక్ష్మి. పాపం వాడికేం తెలుసు చెప్పు? నేను ఫీజు కడతాను. చదివించమని చాలా రోజులుగా చెబుతున్నా, నువ్వు వినడంలేదు. మాకు చదువెందుకంటావ్? మీలాగా వాడు కష్టాలు పడకూడదు కదా. ఈ వయసులో వాడు అంతసేపు ఎండలో ఎలా నిలబడతాడు చెప్పు. అదేదో సిల్వర్ పెయింట్ వళ్ళంతా పుస్తున్నావు. అది వంటికి మంచిది కూడా కాదు. చాలా డేంజర్" అంది సృజన.

బయటకు కన్నీళ్ళు రాకుండా లోపల్లోపలే తెగ కుమిలిపోతూ అంట్లు తోముతోంది లక్ష్మి.

ఆ పాత్రల్ని శుద్ధి చేసినంత సులువుగా, తమ జీవితాల్ని శుద్ధి చేసుకోవడం అంత ఈజీ కాదే అనిపించింది సృజనకి.

సాయంత్రం,,,,

ఆ రోడ్డంతా షాపింగ్ మాల్సే. ఆర్ ఎస్ బ్రదర్స్.. జేసీ బ్రదర్స్, కళామందిర్ ఇన్ని ఉన్నా కూడా ఒక్కటంటే ఒక్కటి కూడా ఖాళీగా లేదు. ఇంతమంది ఇన్నేసి బట్టలు కొంటున్నారా అనిపించింది. ఇంత రష్‌లో షాపింగ్ చేయడమంటే సృజనకు చికాకు. కాని భర్త తీసుకొచ్చినప్పుడే కదా షాపింగ్.

ముగ్గురూ ఇంటికి రిటర్న్ అయ్యారు.

డిన్నర్‌కి వండే పరిస్థితి లేదు. సృజనకు నీరసంగా వుంది. ఏదైనా హోటల్‌లో డిన్నర్ చేసి వెళితే బాగుండుననిపించింది. భర్తను అడిగితే ఏదో క్లాస్ పీకుతాడు. ఆ క్లాస్ కంటే వంట చేయడమే బెటర్ అనుకుంది సృజన. చౌరస్తా దగ్గర సడన్ బ్రేక్ వేశాడు హనుమ. అక్కడ బాగా జనం మూగారు. ఓ పక్క పోలీస్ జీప్ ఆగి ఉంది.

"యాక్సిడెంట్ ఏమైనా అయ్యిందా?" అనుకుంది సృజన.

హనుమ బండి పక్కకు తీశాడు.

"ఏంటి.. ఆ లక్ష్మి మొగుడు ఇక్కడున్నాడు. పోలీసులు ఏదో అడుగుతున్నారు"" అన్నాడు హనుమ.

సృజన మనసు కీడు శంకించింది. గబగబా ఆ గుంపు వైపు నడిచింది. కొంచెం తోసుకుంటూనే ముందుకు వెళ్ళి చూసింది. ఆమెకు గుండె ఆగినంత పనైంది. ఎదురుగా రక్తపు మడుగులో తిరపతి. తల మొత్తం చితికిపోయి ఉంది. వంటి మీద సిల్వర్ కలర్ రక్తంతో రంగు మారిపోయింది. 'నా కొడుకో' అంటూ లక్ష్మి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది.పాపం అందరూ జాలితో చూస్తున్నారామెని.

"పొద్దున్నుంచీ ఏం తినలేదంటా. నీరసంతో పడిపోయాడు. సరిగ్గా అదే టైములో లారీవచ్చి గుద్దేసింది. తల మీదనుంచి టైర్ వెళ్ళిపోయింది. స్పాట్ డెడ్."

అక్కడున్నవాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

సృజనకు బీపీ డౌన్ అయిపోయింది. అక్కడే స్పృహ తప్పి పడిపోతానేమో అనిపించింది. పొద్దున్న నవ్వుతూ కనబడ్డ ఆ చిన్నపిల్లాడు సాయంత్రానికి ఇలా కనిపిస్తాడనీ అస్సలు ఊహించుకోలేకపోయింది.

ఓ గాడ్.

పాపం లక్ష్మి. వెళ్ళి ఊరడించాలా?

"పద వెళ్దాం" అన్నాడు హనుమ.

ఆ పిల్లాడు చనిపోయాడన్న స్పృహ అతనిలో ఏమాత్రం కనబడలేదు. మరీ ఇంత కమర్షియలా? అనిపించింది.

భర్త కాబట్టి తిట్టకూడదేమో కొదుకు వైపు చూసింది.

బ్లాంక్ ఫేస్.

పొద్దున్నే కద వాడితో ఆడుకున్నాడు. చిన్న కన్నీటి బొట్టు కూడా రావడంలేదా వీడికి. ఇదేనా తండ్రి జీన్సు.

దారిలో ఏదో క్లాస్ పీకుతున్నాడు హనుమ. బాగా చదువుకోకపోతే ఇలాగే ఉంటాయ్ పరిస్థితులు అంటున్నాడు.

వాడు "ఊ" కూడా కొట్టడంలేదు.

రాత్రి... హనుమ గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

సృజనకు నిద్రరావడంలేదు. లక్ష్మి, తిరపతి కళ్ళముందే కదలాడుతున్నారు. బాగా ఏడుపొస్తుంది ఆమెకి. కానీ ఏడవలేకపోతోంది.

చప్పుడు రాకుండా మంచం మీద నుంచి లేచి హాల్లోకి వచ్చింది.

చేతన్ రూములో లైట్ వెలుగుతోంది. మెల్లిగా లోపలకు వెళ్ళింది.

టేబుల్ మీద తలపెట్టుకుని ఉన్నాడు. మొహం కనబడటంలేదు.

ఏదో వెక్కుతున్నట్టుగా అనిపించింది.

దగ్గరకు వెళ్ళి చూసింది.

చేతన్ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

అతని చేతుల్లో 'హ్యారీ పోటర్' పుస్తం ఉంది. పొద్దున్న తిరపతి అడిగింది అదే.

చేతన్‌ని గుండెలకి హత్తుకుంది సృజన. అప్పుడు వచ్చాయి ఆమెకు కన్నీళ్ళు.

COMMENTS